క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు



కె.గంగవరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

కె.గంగవరం: స్థానిక బస్టాండ్ వద్ద సోమవారం మన గంగవరం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు చలివేంద్రాన్ని ప్రారంభించి ప్రయాణికులకు మంచినీళ్లు, చల్లని మజ్జిగ అందించారు. వారు మాట్లాడుతూ వేసవి ఉన్నంత వరకు చలివేంద్రం వద్ద మంచి నీళ్లు, మజ్జిగ అందుబాటులో ఉంటాయని ప్రయాణికులు, స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కాజులూరు: జగనన్న ఆరోగ్య సురక్ష -2లో భాగంగా మంగళవారం తర్లంపూడిలో జరగనున్న ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. సోమవారం గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ సర్పంచ్ నరాల బాలరాజు అధ్యక్షతన జరిగే ఈ శిబిరంలో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పాల్గొని రోగులకు సేవలందిస్తారన్నారు. బీపీ, సుగర్, పలు దీర్ఘకాలిక వ్యాధులపైన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. మరింత మెరుగైన చికిత్స అవసరమని గుర్తించిన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స నందిస్తామని రోగులకు అవసరమైన మందులు ఉచితంగా అందించటం జరుతుందన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

కాజులూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. సోమవారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ మండల గ్రామాలలోని 23 ఆర్బీకేల్లోనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించనుందన్నారు. సాధారణ రకం 75 కేజీల ధాన్యం బస్తా రూ.1637, గ్రేడ్ ఏ రకం 1652గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు. ఆర్బీకే కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతులకు గోనె సంచులు, కూలీలు, రవాణా చార్జీలతో పాటు పంట సొమ్ములు 21 రోజుల వ్యవధిలో వారి బ్యాంక్ ఖాతాకు జమ చేయడం జరుగుతుందన్నారు.

పసలపూడిలో ఆలయ జీర్ణోద్ధరణ హోమం



జీర్ణోద్ధరణ హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం: పసలపూడి గ్రామంలో పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన భద్రావతీ సమేత భావనా ఋషి ఆలయం జీర్ణోద్ధరణ హోమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ ఆలయం శిథిల స్థితికి రావడంతో ఆలయాన్ని తొలగించి నూతన ఆలయ నిర్మాణం చేపట్టనున్నారు. దీనిలో భాగంగా ఆలయం తొలగించేందుకు ముందుగా వేద పండితులు దేవులపల్లి సత్యనారాయణ ప్రసాద్‌శర్మ, దేవులపల్లి సీతా రామసాయి శర్మ, దేవులపల్లి కృష్ణశాస్త్రి శర్మ, వెలమలపల్లి పలమ రాజుశర్మ ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బేత ముత్యాలరావు, పందిరి గంగరాజు, కాకి ఆదినారాయణ, సీరం భీమేశ్వరరావు, ఒగ్గు శ్రీధర్, జక్కా మురళి, సూరిశెట్టి ప్రసాద్, ఒగ్గు హనుమంతరావు, పసగాడి వీరబాబు, తదితర పద్మశాలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.25 వేల విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు సోమవారం కొత్తపేటకు చెందిన మల్లంపల్లి శేషగిరి రూ.25,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ అధికారులకు అందజేశారు. విరాళం అందించిన దాతకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, స్వామి వారి దర్శనం కల్పించి, వేదాశీర్వచనం అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది.

పుస్తకం.. ప్రియ నేస్తం

- వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేసే బాల సాహిత్యం
- 'చదవడం మాకిష్టం'తో ప్రోత్సాహం
- నేడు ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం



చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా లైబ్రరీలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు(ఫైల్)

రాయవరం: పుస్తకం.. హస్త భూషణం, చిరిగిన చొక్కా అయిన తొడుక్కో.. కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో .. ఎక్కడున్నా ఆనందంగా జీవించగలిగే వారు పుస్తక ప్రియులు.. ఇలా పలు కొటేషన్లు పుస్తకాల ప్రాముఖ్యతను తెలియజేస్తాయి. బాల్యం నుంచి జీవిత చరమాంకం వరకూ పుస్తకం మనిషికి మంచి నేస్తం అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. రాను రాను పుస్తక పఠనం తగ్గిపోతోంది. బాలల్లో ఈ లోటును భర్తీ చేసేందుకు భర్తీ చేసేందుకు ఏటా ఏప్రిల్ 2న అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం నిర్వహిస్తున్నారు.

తరతరాలకు గుర్తుండి పోయేలా

చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు, బుజ్జాయి ఇవన్నీ బాలల బొమ్మల పుస్తకాలు. గతంలో పెద్దల సైతం వీటిని ఇష్టంగా చదివేవారు. జానపద కథలు, ఉపాయం, సాహస యాత్రలు, విశ్లేషణాత్మక కథలు ఇలా ప్రతి నెలా ఒక్కో పుస్తకంలో డజనుకు పైగా విభిన్నమైన కథలు మెదడుకు మేతగా ఉండేవి. అలాగే బేతాళ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు మరపురానివిగా తరతరాలకు గుర్తుండిపోయాయి. ఆ శీర్షికలు, కథలు తెలుగు వారి మనసులో పదిలమైన స్థానాన్ని సంపాదించుకున్నాయి. కాలక్రమంలో ఆ పత్రికలు కనుమరుగయ్యాయి. అవి అందిస్తూ వచ్చిన విలువలు కూడా నేటి ఆధునిక కాలంలో మాయమవుతున్నాయి. నాటి పిల్లలు, పెద్దలు, జీవితంలో ఎదురయ్యే సమస్యలకు తాము చదివిన కథల నుంచి పరిష్కారాల్ని వెతుక్కునేవారు. ఆ కథల నుంచి విజయాలను తమ జీవితాలకు అన్వయించుకునేవారు. ప్రస్తుతం ఇదంతా ఓ తీపి జ్ఞాపకంగా మిగిలిపోయింది అని చెప్పవచ్చు.

మంచి మిత్రునితో సమానం

మంచి పుస్తకం ఒక మంచి స్నేహితులతో సమానం అంటారు. మహానాయకుల జీవిత చరిత్రలు చదవడం వలన వారు ఉన్నతమైన వ్యక్తులుగా ఎదిగేందుకు పడిన కష్టాలు తెలుస్తాయి. నాటి చరిత్ర.. సమకాలీన అంశాలు.. కష్టాలు ఎదుర్కునేందుకు వారు అనుసరించిన మార్గం.. పాఠకుడిని జ్ఞానిగా, గొప్ప వ్యక్తిగా మార్చేవి. అలాగే జ్ఞాపకశక్తిని, భాషా పరిజ్ఞానాన్ని పెంచేవి. బేతాళ కథలు, పేదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు వివేచనను, సమయస్ఫూర్తిని, నిశిత పరిశీలనా శక్తిని పెంచేవి. గలీవర్ సాహస యాత్రలు ధైర్య సాహసాలు నింపేవి. జానపద కథలు నాగరికత మూలాలను తెలియజేసేవి. మంత్ర తంత్రాల కథలు భావోద్వేగాల సమతుల్యతను పెంచేవి.

మార్గదర్శనం చేస్తూ

మంచి పుస్తకాలు మనకు మార్గదర్శకంగా నిలుస్తాయి అనడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఒక మంచి పుస్తకం అవసరమైనపుడు పది మంది స్నేహితులు ఇచ్చే అండనిస్తుంది. మంచి పుస్తకాల ద్వారా బాల్యంలోనే మానవత, నైతిక, సామాజిక విలువలను నేర్చుకునేవారు. ఆ పుస్తకాలు జీవితాంతం వారిని ప్రభావితం చేసి సమాజంలో ఉత్తమ వ్యక్తిగా గౌరవ మర్యాదలు కల్పించేవి. ఇతర దేశాలలో నేటికీ బాల సాహిత్యానికి ఎంతో ఆదరణ ఉంది. అక్కడ పెద్దలు సైతం బాలల కథలను చదువుతారు. తద్వారా పిల్లల మనస్తత్వాన్ని అర్థం చేసుకుంటారు. ఫలితంగా పిల్లలు, పెద్దల మధ్య అవగాహన, ఆత్మీయత పెరిగి అంతరాలు దూరమవుతున్నాయని పలువురు మేధావులు తమ అధ్యయనాల్లో పేర్కొంటున్నారు.

పాఠశాల విద్యాశాఖ ప్రోత్సాహం

బాలల్లో పుస్తకాలు చదివే అలవాటు క్రమంగా పోవడం వల్ల బాలలు సామాజిక విలువలకు దూరమవుతుండడాన్ని రాష్ట్ర విద్యాశాఖ గమనించింది. ఈ లోటును భర్తీ చేసేందుకే 2022 నుంచి 'చదవడం నాకిష్టం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పాఠశాలల విద్యార్థులు ఆదివారం ఉదయం సమీప గ్రంథాలయాలకు వెళ్లి రెండు గంటల పాటు బాలల పుస్తకాలు చదివేలా ప్రణాళికలు అమలు చేస్తుంది. దీంతో ఆదివారాల్లో గ్రంథాలయాలు బాలలతో కలకలాడుతున్నాయి. రెండేళ్లుగా చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని జిల్లాలో అమలు చేస్తున్నారు. దీనికి తోడు పాఠశాలల్లోని లైబ్రరీలకు కూడా సమగ్ర శిక్షా ద్వారా విలువైన పుస్తకాలను సరఫరా చేశారు. మూడు రకాల పబ్లికేషన్స్‌కు చెందిన పుస్తకాలను జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటుగా, ప్రభుత్వ కళాశాలలకు కూడా అందజేశారు. జిల్లాలో గతేడాది సమగ్ర శిక్షా ద్వారా 1,36,813 లైబ్రరీ పుస్తకాలను ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 1,580 పాఠశాలలకు పంపిణీ చేశారు.

పఠనాసక్తి పెరుగుతుంది



చిన్నారులతో వారికి ఇష్టమైన కథల పుస్తకాలను చదివించడం వలన పఠనాసక్తి పెరుగుతుంది. కథల పుస్తకాలు చదవడం వలన భాషపై పట్టును సాధించగలుగుతారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెరుగుతాయి. ముఖ్యంగా వేసవిలో విద్యార్థులను పుస్తక పఠనం చేసేలా తల్లిదండ్రులు కూడా శ్రద్ధ తీసుకోవాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ


ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి



పాఠశాలల్లోని లైబ్రరీలకు సమగ్ర శిక్ష ద్వారా అత్యంత విలువైన పుస్తకాలను ప్రభుత్వం అందించింది. వాటిని విద్యార్థులందరూ చదివేలా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. నేటి సాంకేతిక కాలంలో విద్యార్థులను పుస్తక పఠనానికి దగ్గరం చేయడం ద్వారా వారిలో నైతిక, మానవత, సామాజిక విలువలను పెంచడానికి వీలవుతుంది.

– ఎం.కమలకుమారి, డీఈవో, అమలాపురం

పండుటాకులపై బాబు రాజకీయమా?



పండు గోవిందరాజు

కె.గంగవరం: పండుటాకులపై బాబు ఇంత నీచ రాజకీయానికి దిగడం చాలా దారుణమని మార్కెట్ కమిటీ చైర్మన్, దళిత నాయకుడు పండు గోవిందరాజు విమర్శించారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తారీఖున తెలవారక ముందే తలుపు తట్టి పింఛన్లు అందిస్తూ వృద్ధుల మోముల్లో చిరునవ్వులు చిందిస్తున్న ప్రభుత్వ పని తీరును కేవలం సొంత లాభం కోసం రాజకీయం చేయడం దారుణమన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పింఛను దారులు ఒకప్పటి తిప్పలు మాకు ఒద్దని టీడీపీని విమర్శిస్తున్నారని, పింఛన్‌తోనే జీవనం గడిపే కొంత మంది పింఛనుదారులకు కన్నీళ్లు తెప్పించిన పాపం ఊరికే పోదన్నారు. చంద్రబాబు నీచ స్వార్థ రాజకీయాలకు పెట్టిందని పేరని ఆయన పేదలకు ఒక్క మంచి పని చేయకపోగా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమాన్ని అడ్డుకోవాలని చూడడం సిగ్గుచేటన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలకు తప్పకుండా టీడీపీ కూటమికి తగిన బుద్ధి చెబుతారని చెప్పారు.

నవోదయకు రుద్రాన్ష్ ఎంపిక



నవోదయకు ఎంపికైన రుద్రాన్ష్

కపిలేశ్వరపురం: మండలంలోని మాచర గ్రామ శివారు శ్రీరామపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థి చొల్లంగి రుద్రాన్ష్ జవహర్ నవోదయ విద్యాసంస్థలో విద్య అభ్యసించేందుకు ఎంపికయ్యారు. విద్యార్థి రుద్రాన్ష్ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ ఉచిత విద్యాను పొందుతారు. విద్యార్థినిని ఎంఈఓ కె.తాతారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సంక్షేమం కావాలంటే మళ్లీ జగనే రావాలి



కుందూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్, ఎంపీ అభ్యర్థి వరప్రసాద్

కె.గంగవరం: పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమం అందాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని, టీడీపీ వస్తే ప్రజలను దోచుకుతినేందుకు జన్మభూమి కమిటీలు వస్తాయని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్, ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్ అన్నారు. మండలంలోని కుందూరు, యండగండి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలు ఏ లబ్ధి కావాలన్నా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వం ఏర్పాడిన తరువాత ఈ 58 నెలల్లో అర్హులైతే చాలు సంక్షేమం ఇంటి గుమ్మంలోకే వచ్చేలా సీఎం జగన్ ప్రజారంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. కులం, మతం పార్టీ భేదాల్లేకుండా టీడీపీ, జనసేన వారికి కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలకు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి ప్రజలతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఓటేయాలని కోరారు. ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాద్‌తో కలసి ఇంటింటికీ తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు పంపన సత్యానందం, దత్తుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆది నుంచీ చంద్రబాబుది నీచబుద్ధే..

- పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను తప్పించడం తగదు
- మీడియాతో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడిది మొదటి నుంచి నీచమైన బుద్ధేనని వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో పేదలకు మంచి జరుగుతున్నా ఓర్వలేక పోతున్నారంటూ మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తన అనుచరులతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి, పింఛన్ల పంపిణీ బాధ్యతల నుంచి వలంటీర్లను తప్పించిన విపక్ష నేత చంద్రబాబుపై తోట ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వంలో ప్రజల కోసం నిస్వార్థంగా సేవలు అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు మొదటి నుంచీ వ్యతిరేకంగానే ఉన్నారన్నారు. బాబుకు కావాల్సింది ప్రజలకు జరిగే మంచి పనులు కాదన్నారు. ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు మోపి ఏదో రకంగా గద్దె నెక్కాలన్న తాపత్రయం మాత్రమే అన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజలకు ముంగిటకు తెచ్చి, దేశంలో ఏ రాష్ట్రంలోనూ అందించని విధంగా సంక్షేమ పథకాలను అందిస్తుంటే బాబుకు కడుపు మంటగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు రాష్ట్ర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఉన్నారని పేర్కొన్నారు.

వ్యంగ్య వ్యాఖ్యలు తగవు

వైఎస్సార్ సీపీ అనంతపురం జిల్లా, సింగనమల అసెంబ్లీ టికెట్‌ను జగన్‌మోహన్‌రెడ్డి బీసీ అయిన ఓ సాధారణ టిప్పర్ డ్రైవర్‌కు ఇస్తే, దానిపై చంద్రబాబు వ్యంగ్యంగా మాట్లాడడం తగదని తోట త్రిమూర్తులు అభ్యంతరం తెలిపారు. దీనిని బట్టి చూస్తుంటే బీసీల పట్ల చంద్రబాబుకు ఎంత ప్రేమ ఉందో రాష్ట్ర ప్రజానీకానికి అర్థం అవుతోంన్నారు. రేపు జరగబోయే ఎన్నికల్లో బాబును ఘోరంగా ప్రజలు ఓడించి ఇంటికి సాగనంపడం ఖాయమన్నారు.అదే బాబుకు ప్రజలు ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ అని వ్యాఖ్యానించారు. రైస్‌మిలర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేగుళ్ల పట్టాభి రామయ్యచౌదరి, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, పార్టీ నాయకులు సిరిపురపు శ్రీనివాసరావు, పొలమాల సత్తిబాబు, విప్పర్తి సింహాచలం, పినిపే శ్యామ్, సలాది సూర్య చంద్రరావు, జంగా విశ్వాస కుమార్ పాల్గొన్నారు.

అవ్వా తాతల ఉసురు తగులుతుంది

మండపేట: ఎన్నికల వేళ వలంటీర్ల ద్వారా పింఛన్ల బట్వాడా చేపట్టకూడదంటూ తన అనుయాయుల ద్వారా ఫిర్యాదు చేయించి, అడ్డుకున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడికి రాష్ట్రంలోని అవ్వా తాతల ఉసురు తగలక మానదని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పలివెల సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా ప్రజల ముంగిటకే చేరుతున్నాయన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ తెల్లవారుజామునే వలంటీర్ల ద్వారా సామాజిక పింఛన్లు లబ్ధిదారులకు చేరుతున్నాయన్నారు. ఈ విధంగా ప్రభుత్వానికి వస్తున్న మంచి పేరును చూసి తట్టుకోలేక చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ఎన్నికల కమిషన్ పునరాలోచన చేసి వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియను సజావుగా సాగేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు దివ్యాంగ చిన్నారులకు ప్రత్యేక శిబిరం



దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని రామచంద్రపురం భవిత కేంద్రం వద్ద నేటి ఉదయం 9 గంటల నుంచి దివ్యాంగ చిన్నారులకు అవసరమైన ఉపకరణాలు అందజేసేందుకు వీలుగా గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్లు భవిత కేంద్ర నిర్వాహకులు ఎంవీ బాబు, సీహెచ్ నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిపుణులైన వైద్య బృందం దివ్యాంగ చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి వారికి అవసరమైన వినికిడి యంత్రాలు, ట్రై సైకిల్స్, చంక కర్రలు, రోలేటర్స్ తదితర ఉపకరణాలు ఎంత మందికి అవసరమో గుర్తించడం జరుగుతుందన్నారు. దీని ప్రకారం వారికి ఆయా ఉపకరణాలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయబడతాయని తెలిపారు. ఈ శిబిరానికి రామచంద్రపురం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలకు చెందిన దివ్యాంగులు వారి వికలత్వ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, తల్లి, తండ్రి, దివ్యాంగుల ఆధార్ కార్డులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకుని హాజరయ్యే విధంగా తల్లిదండ్రులు సిద్ధం కావాలని సూచించారు. అదే విధంగా పై నాలుగు మండలాల్లో అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ తమ పరిధిలోని ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులకు అవగాహన కలిగించి వైద్య శిబిరానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వైద్య శిబిరానికి సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే 91601 27921, 93983 97079 ఫోన్ నంబర్లపై సంప్రదించాలని సూచించారు.

త్రిమూర్తులు విజయానికి కృషి చేయాలి



సర్పంచ్ ఆరిఫ్‌ను సత్కరిస్తున్న శెట్టిబలిజ సంఘ మహిళలు

రాయవరం: వైఎస్సార్ సీపీ మండపేట ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ ఆరిఫ్ కోరారు. సోమేశ్వరం గ్రామంలోని శెట్టిబలిజ వీధిలో స్థానికులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. గ్రామంలో శెట్టిబలిజ కల్యాణ మండప నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట చేసిన కృషిని, గ్రామాభివృద్ధిలో ఆయన ముద్రను ఆరిఫ్ వివరించారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు సర్పంచ్ ఆరిఫ్‌ను ఘనంగా సత్కరించారు. శెట్టిబలిజ సంఘం నేతలు గుత్తుల శివ, గుడాల సుబ్రహ్మణ్యం, కోట పండు, అనుసూరి శ్రీను బాబు, చింతపల్లి దుర్గాప్రసాద్, కురుపూడి దుర్గాప్రసాద్, కడలి నాగు, బండి నాగు పాల్గొన్నారు.

నిండు శోకంతో ఇమాం అలీ వర్ధంతి



ద్రాక్షారామలో గుమ్మటం ఊరేగిస్తున్న ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో ముస్లింలు మహ్మద్ ప్రవక్త సోదరుడు ఇమాం హజరత్ అలీ వర్ధంతి కార్యక్రమాలను మూడు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. రంజాన్ మాసంలోని 19వ రోజు ఇరాక్ దేశంలోని కుఫా మసీదులో తెల్లవారుజామున పార్థన చేస్తుండగా విషం పూసిన ఖడ్గంతో శత్రువులు ఇమాం అలీ శిరస్సును ఖండించిన విషాద సంఘటనను తలచుకుంటూ గ్రామంలో మజ్లిస్, మాతం వంటి భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం రాత్రి పంజేషా పంజాలో మజ్లిస్ అనంతరం ఆలం ఊరేగింపు నిర్వహించారు. గురువారం మధ్యాహ్నం పంజాలో మజ్లిస్ అనంతరం నఖలే ముబారక్(గుమ్మటం), ఆగావారి పంజా వరకు నిర్వహించి మాతం చేశారు. మర్సియా(విషాద గేయాలు) ఆలపించారు. ఇరాన్ దేశంలో పట్టభద్రుడైన మీర్జా అస్కరీ హుస్సేన్ రంజాన్ నెలలో రోజా(ఉపవాసం), నమాజ్‌లు చేయడంలో సూచనలు అందజేశారు. మజ్లిస్‌లు బోధించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భోజన వసతి కల్పించారు. ఇమాం అలీ అభిమాన సంఘాలు, అంజుమన్ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉమ్మడి పొత్తులోను దండోరాకు అన్యాయం



పుల్లేటికుర్రు సమావేశంలో పాల్గొన్న దండోరా నాయకులు

అంబాజీపేట: ఉమ్మడి కూటమిలోనూ బీజేపీ పార్టీ దండోరా నాయకులకు తీవ్ర అన్యాయం చేసిందని దండోరా నాయకులు విమర్శించారు. పుల్లేటికుర్రులో సీనియర్ బీజేపీ నాయకులు కొల్లి సూర్యారావు స్వగృహం వద్ద నియోజకవర్గ దండోరా సన్నిహితులతో ఆత్మీయ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి పొత్తులో పి.గన్నవరం నియోజకవర్గంలో దండోరా సామాజిక వర్గానికి చెందిన నాయకుడు గెలిచే అవకాశాలు ఉన్నా సీటు కేటాయించకుండా అవమానపరిచారన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో జనసేనకు సీటు కేటాయించి బీజేపీ మాదిగలకు అన్యాయం చేసిందన్నారు. జిల్లాలో మాదిగల రాజకీయ భవిష్యత్ శూన్యంగా మారిందని, ఎన్నికల తర్వాత ఉమ్మడి పార్టీలు తమను పట్టించుకునే దాఖలాలు లేవన్నారు. త్వరలో సీనియర్ దండోరా నాయకులతో చర్చించి రాజకీయ భవిష్యత్ కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు బొమ్మి బాలరాజు, తొత్తరమూడి గోవింద్, చింతపర్తి భీమన్న, లూటుకుర్తి సత్యనారాయణ, కొడమంచలి రమణ, నేదునూరి సత్యనారాయణ, కొల్లి గంగాధర్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

అలమూరు: మండలంలోని నవాబుపేటలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత జ్ఞాన ప్రచార కార్యక్రమం జరిగింది. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం శాఖ అధ్యక్షుడు శేఖర్‌బాబు ఆధ్వర్యంలో భక్తబృంద సభ్యులు గ్రామంలో పర్యటించి ఈనెల తొమ్మిదిన జరిగే ఉగాది విశిష్టతను తెలియజేశారు. హిందుత్వంలోని సంప్రదాయాలను, వేమన భగవాన్ పద్యాల్లోని జ్ఞానాన్ని తెలియజేశారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగ అధ్యాయంలోని 16,17 శ్లోకాల ఆధారంగా పరమాత్మ, ఆత్మ, జీవాత్మల విధానాన్ని వివరించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల బోధనలను ప్రజలకు వివరించారు. అనంతరం హిందూ మత గ్రంథాలను ప్రదర్శించి హిందూమతంలో ఉన్న గొప్పతనాన్ని, ప్రజలందరికీవివరించాలని భక్తులకు సూచించారు. త్రైత సిద్ధాంత ప్రతినిధులు వేణు మాధురి, శోభారాణి, సంధ్యారాణి, లక్ష్మీనారాయణ, బీఎస్ఎన్ మూర్తి, లోహిత, జోష్, జస్వంత్, విజయ్, భరత్, జైరాం, భరత్, జయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

మామిడికుదురు: పెదపట్నంలంక దేవి సెంటర్‌లో కోదండరామస్వామి వారి పాల శిలా విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ముత్యాల వీవీలక్ష్మీసత్యనారాయణ–శ్రీదేవి, ముత్యాల అమ్మిరాజు–కుమారి, ముత్యాల దుర్గా ప్రసాద్–ఉషాదేవి దంపతులు కర్తలుగా కూర్చుని పలు పూజలు చేశారు. దీనిలో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, దీక్షాధారణ, చతుర్వేద స్వస్తి, తదితర పూజలను వైభవంగా జరిపించారు. 3వ తేదీ వరకు ఈ పూజలు జరిగాయి.

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

మండపేట: స్థానిక బురుగుంట చెరువు సమీపాన వెలసిన సీతారామ క్షేత్రం వద్ద శ్రీరామ నవమి పురస్కరించుకుని ఈ నెల 15 నుంచి 20వరకూ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకుడు మల్లిపూడి గణేశ్వరరావు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు ఆలయం వద్ద సోమవారం రాట ముహూర్తం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రధానార్చకుడు మరింగంటి వరదాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. గణేశ్వరరావు మాట్లాడుతూ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లిపూడి వెంకటేశ్వరరావు, వేగుళ్ల పుష్క రాజు,పెనుమర్తి బొబ్బిలి రాజు, మెర్ల పుల్లయ్య చౌదరి, వల్లూరి కిట్టయ్య, ముత్యాల రామకృష్ణ, పసల కొండ తదితరులు పాల్గొన్నారు.

పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు



వీఆర్వో నాగేశ్వరరావు దంపతులను సత్కరిస్తున్న తహసీల్దార్ విమలకుమారి

అంబాజీపేట: విధి నిర్వహణలో ప్రజల మధ్యే ఉంటూ వారికోసం పని చేసేవారికి ఎల్లవేళలా గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ జె.విమలకుమారి అన్నారు. గంగలకుర్రు వీఆర్వోగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న వక్కలంక నాగేశ్వరరావు సన్మాన సభను అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించే వారు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అనంతరం నాగేశ్వరరావు, నాగమణి దంపతులను దుశ్శాలువా, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి.నాగపద్మ, ఆర్‌ఐ ఎండీ ఇబ్రహీం, వీఆర్వోలు, వీఆర్ఏలు, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

భగవంతుడు మెచ్చేలా జీవించాలి

అయినవిల్లి: భగవంతుడు మెచ్చేటట్టు మానవులు జీవిస్తేనే వారి జీవితం సార్థకం అవుతుందని నల్లచెరువులోని అంతర్జాతీయ శ్రీకృష్ణమందిర్ నిర్వాహకుడు, ప్రభుజీ సుందర శ్రీనివాసదాస్ అన్నారు. ఆదివారం నల్లచెరువులో శ్రీకృష్ణతత్వాన్ని శ్రీనివాసదాస్ బోధించారు. భగవద్గీతలోని 12 వ అధ్యాయాన్ని ఆయన వివరించారు. భగవంతుడు సూచించిన దారిలో ప్రయాణిస్తే ఆయన సంతోషిస్తాడన్నారు. ఆయన సేవలో తరించిన వారే ఆయనలో ఐక్యం అవుతారన్నారు. దేవాధిదేవుడు సేవ చేయడం కూడా పూర్వజన్మ సుకృతమే అన్నారు. అనంతరం భక్తులు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.